AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
6-2-2026 (Friday)
MAIN EDITION

'ఆంథ్రోపిక్'తో ఆందోళన వద్దు..: సుందర్ పిచాయ్

అక్షరటుడే, నేషనల్‌డెస్క్: అమెరికాకు చెందిన ప్రముఖ ఏఐ కంపెనీ ఆంథ్రోపిక్ రూపొందించిన డాక్యుమెంట్ రివ్యూస్, డాటా అనాలిసిస్ చేయగల కొత్త ఏఐ టూల్స్‌తో టెక్ కంపెనీలపై ఒత్తిడి నెలకొంది. ఈ కొత్త ఏఐ టూల్ మానవ ప్రమేయం లేకుండానే, క్లిష్టమైన ఆఫీసు పనులను పూర్తి చేస్తుందంటూ 'ఆంథ్రోపిక్' చేసిన ప్రకటన ప్రపంచ టెక్నాలజీ రంగంలో ప్రకంపనలు సృష్టించింది. ఆంథ్రోపిక్ టూల్స్ వల్ల ఔట్‌సోర్సింగ్ ప్రాజెక్టులు తగ్గే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. మన ఐటీ కంపెనీలపై తీవ్ర ప్రభావం చూపిందని భావించారు. అయితే ఆంథ్రోపిక్ కొత్త టూల్స్‌తో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ పేర్కొన్నారు.

గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్.. ముగ్గురు మావోలు మృతి

అక్షరటుడే, నేషనల్ డెస్క్: మహారాష్ట్రలోని గడ్చిరోలిలో మరోసారి ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. గురువారం నుంచి భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరుగుతున్న ఎదురుకాల్పుల్లో ఓ పోలీసు ప్రాణాలు కోల్పోగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భమ్రాగడ్ తాలూకాలో నిన్న రాత్రి నుంచి ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది. ఇందులో ఇద్దరు మహిళలతో సహా ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి.

లాభాల్లో ముగిసిన దేశీయ మార్కెట్లు



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: దేశీయ మార్కెట్లు శుక్రవారం లాభాల్లో ముగిశాయి. ఆర్‌బీఐ వడ్డీ రేట్ల ప్రకటన నేపథ్యంలో ఉదయం నష్టాల నుంచి సూచీలు కొద్ది మేర లాభపడ్డాయి. సెన్సెక్స్ 266 పాయింట్లు లాభపడి, 83,580 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 50 పాయింట్లు పెరిగి, 26,693 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 83,249 వద్ద ప్రారంభమై ఒక దశలో 83,612 వద్ద గరిష్ఠాన్ని తాకింది.

రేపు దేశవ్యాప్త సమ్మె

అక్షరటుడే, నేషనల్ డెస్క్: దేశవ్యాప్తంగా పనిచేస్తున్న ఓలా, ఉబర్, రాపిడో డ్రైవర్లు ఫిబ్రవరి 7న జాతీయ స్థాయి సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ సమ్మె కారణంగా పలు నగరాల్లో రోజువారీ రవాణా సేవలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. డ్రైవర్లు రైడ్ రిక్వెస్టులను క్యాన్సిల్ చేయడం లేదా యాప్‌లను పూర్తిగా ఆఫ్ చేయాలని నిర్ణయించారు.

కర్ణాటక యువకుడికి రూ.49 కోట్ల లాటరీ



అక్షరటుడే, నేషనల్ డెస్క్: యూఏఈలోని అబుదాబిలో నిర్వహించే 'బిగ్ టికెట్ లాటరీ'లో కర్ణాటకలోని ఉడుపి జిల్లాకు చెందిన శంతను శెట్టిగార్‌కు బంపర్ ఆఫర్ తగిలింది. లక్కీ డ్రాలో 20 మిలియన్ల దిర్హామ్‌లు(సుమారు రూ.49 కోట్లు) గెలుచుకున్నారు. ఒమన్‌లోని రిటైల్ రంగంలో పని చేస్తున్న ఆయన.. స్నేహితుడితో కలిసి లాటరీ టికెట్ కొన్నారు.

భూమిపై ప్రజలకు సర్వహక్కులు: సీఎం

అక్షరటుడే, ఏపీ: ప్రజల భూమిపై వారికే సర్వహక్కులు కల్పించామని సీఎం చంద్రబాబు తెలిపారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలంలో 'మీ భూమిమీ హక్కు' కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. లంచాల వ్యవస్థకు స్వస్తి చెప్పడానికే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. గతంలో భూ సమస్యల ఫిర్యాదులు ఇబ్బడిముబ్బడిగా వచ్చాయని గుర్తు చేశారు. ఇప్పుడు భూమిని ఇతరుల పేరుపైకి మారిస్తే వెంటనే తెలుస్తుందన్నారు. క్యూఆర్ కోడ్‌తో మీ ఫోన్‌లోనే మీరు చూసుకోవచ్చని చెప్పారు.

పాకిస్తాన్‌లో భారీ పేలుడు..

అక్షరటుడే, నేషనల్ డెస్క్: పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు సంభవించింది. శుక్రవారం ప్రార్థనల అనంతరం మసీదు వద్ద పేలుడు చోటుచేసుకుంది. ఈ ఘటనలో 50 మంది పౌరులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న భద్రతా బలగాలు సహాయక చర్యలు మొదలెట్టాయి. క్షతగాత్రులను దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. ముందు జాగ్రత్త చర్యగా ఇస్లామాబాద్‌లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.

జనసేన ఎమ్మెల్యే శ్రీధర్‌కు హైకోర్టులో ఊరట

అక్షరటుడే, ఏపీ: రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై నమోదైన లైంగిక వేధింపుల కేసులో ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ ఎమ్మెల్యే దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, ఈ దశలో అరెస్ట్ వంటి కఠిన చర్యలకు వెళ్లవద్దని పోలీసులకు సూచించింది. అలాగే ఎమ్మెల్యే నుంచి పూర్తి వివరణ తీసుకోవాలని ఆదేశించింది. బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 35(3) నిబంధనలను అనుసరించాలని చెప్పారు. అరెస్ట్ అవసరమైతే, అందుకు గల కారణాలను రాతపూర్వకంగా నమోదు చేయాలని పేర్కొంది. ఈ ఆదేశాలతో అరవ శ్రీధర్‌కు తాత్కాలిక ఊరట లభించినట్లయ్యింది.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తన విధాన నిర్ణయాన్ని ప్రకటించింది. కీలకమైన వడ్డీరేట్లను యథాతథంగా ఉంచింది. గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని సెంట్రల్ బ్యాంక్ ఆరుగురు సభ్యుల ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశం ఈనెల 4 న ప్రారంభమై 6న ముగిసింది. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆర్బీఐ చివరి విధాన సమీక్ష సమావేశం ఇది. ఈ సమావేశం నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నామని ప్రకటించారు. - అక్షరటుడే, బిజినెస్ డెస్క్

ఆర్బీఐ వడ్డీ రేట్లు యథాతథం..

- ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ చివరి విధాన సమీక్ష
- నిర్ణయాలను వెల్లడించిన ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

ఏడాదిలో 1.25 బేసిస్ పాయింట్లు తగ్గింపు గతేడాది ఆర్బీఐ కీలకమైన వడ్డీ రేట్లను పలు మార్లు తగ్గించిన విషయం తెలిసిందే. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లలో 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన కేంద్ర బ్యాంక్.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. డిసెంబరులో మరో పావు శాతం తగ్గించింది. అంటే గతేడాది ఫిబ్రవరినుంచి డిసెంబర్ వరకు 1.25 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ రేట్లు తగ్గాయన్న మాట. ఒక బేసిస్ పాయింట్ అంటే ఒక పర్సెంటేజ్ పాయింట్‌లో వందో వంతుకు సమానం.

ఆర్బీఐ మీటింగ్‌కు సంబంధించిన కీలక అంశాలు..

ద్రవ్యోల్బణం, వృద్ధి అంచనాలు సానుకూలంగా ఉన్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉంది. కార్పొరేట్ కంపెనీల పనితీరు మెరుగుపడటం, అసంఘటిత రంగంలో స్థిరమైన వృద్ధి తయారీకి ఊతమివ్వనుంది. యూరోపియన్ యూనియన్, యూఎస్‌లతో ట్రేడ్ డీల్స్ వల్ల వృద్ధి వేగం ఎక్కువ కాలం కొనసాగే అవకాశం ఉంది.

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 7.4 శాతం వృద్ధి నమోదవుతుందని అంచనా. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి త్రైమాసికంలో 6.9 శాతం, రెండో త్రైమాసికంలో 7 శాతం వృద్ధి నమోదు కావొచ్చని అంచనా.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 2.1 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది.
- 2026- 27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 4 శాతం, రెండో త్రైమాసికంలో 4.2 శాతం ద్రవ్యోల్బణం నమోదు కావొచ్చు.
- జనవరి చివరి నాటికి ఫారెక్స్ నిల్వలు 723.8 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వ్యవస్థలో ద్రవ్య లభ్యత రోజువారీ సగటున రూ. 75 వేల కోట్లుగా ఉంది.

సీఎం రేవంత్‌తో డిప్యూటీ సీఎం భట్టి భేటీ

అక్షరటుడే, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. మున్సిపల్ ఎన్నికలు, ఇతర అంశాలపై చర్చిస్తున్నారు. త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అనుసరించాల్సిన వ్యూహం, నేతల మధ్య సమన్వయం తదితర విషయాలపై రేవంత్, భట్టి చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. ఇటీవల మంత్రులతో సీఎం నిర్వహించిన భేటీకి డిప్యూటీ సీఎం హాజరుకాలేదు. ఈ నేపథ్యంలో సీఎంతో ఆయన ప్రత్యేకంగా భేటీ కావడం గమనార్హం.

ఇరాన్‌ను వీడాలంటూ తన పౌరులకు అమెరికా అడ్వైజరీ

అక్షరటుడే, నేషనల్‌డెస్క్: ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వేగంగా అభివృద్ధి చేస్తోందని, అధిక స్థాయి యురేనియం సంపుష్టీకరణ చేస్తోందని అమెరికా, ఇజ్రాయెల్ ఆరోపిస్తున్నాయి. 2015లో చేసుకున్న జేసీపీవోఏ (ఇరాన్ అణు ఒప్పందం) నుంచి ట్రంప్ 2018లో వైదొలగారు. మరోవైపు ఇరాన్‌పై ఒత్తిడి పెంచడానికి ట్రంప్ కఠినమైన ఆంక్షలు విధించారు. దీంతో ఇరాన్ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ద్రవ్యోల్బణం పెరిగిపోయింది. దీంతో పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయి. వీటిని అణచివేయడానికి ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడంతో వేలాది మంది మరణించినట్లు నివేదికలు చెబుతున్నాయి. దీనిపై ట్రంప్ తీవ్రంగా స్పందించి, సైనిక జోక్యం చేసుకుంటామని హెచ్చరించారు. 'మీ చుట్టుపక్కల ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు గమనించండి' అంటూ యూఎస్ ఇరాన్‌లోని తన పౌరులకు అడ్వైజరీ జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆందోళన వ్యక్తమవుతోంది.

బిట్‌కాయిన్ భారీ పతనం

అక్షరటుడే, బిజినెస్ డెస్క్: క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్ వాల్యూ భారీగా పతనమైంది. ఒకేరోజు 12 శాతానికి పైగా పడిపోయింది. దీంతో 63,295 డాలర్లకు దిగొచ్చింది. 2024 తర్వాత ఒకరోజు అత్యధిక పతనం ఇదే కావడం గమనార్హం. ఒక దశలో 60వేల డాలర్లకు కూడా పడిపోయింది. విలువైన లోహాల్లో అస్థిరత, ఐటీ షేర్లలో భారీ అమ్మకాలు ఈ పరిస్థితికి కారణమన్నారు. దాంతో దాదాపు ఒక బిలియన్ డాలర్ల విలువైన బిట్‌కాయిన్ పొజిషన్లను మదుపర్లు వదిలించుకున్నారని క్రిప్టో కరెన్సీ యాప్ కాయిన్ గ్లాస్ డేటా వెల్లడించింది.

విద్యార్థులతో ముచ్చటించిన ప్రధాని మోదీ

అక్షరటుడే, నేషనల్‌డెస్క్: పరీక్షాపే చర్చా 9వ ఎడిషన్‌లో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం విద్యార్థులతో ముచ్చటించారు. పరీక్షల ముందు ఒత్తిడిలో ఉండే విద్యార్థుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపేలా పరీక్షాపే చర్చ కార్యక్రమం ద్వారా ప్రధాని మోదీ వారితో మాట్లాడుతున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది కూడా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ఆ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఇందుకు సంబంధించిన మోదీ వీడియోను శుక్రవారం 'ఎక్స్' వేదికగా షేర్ చేశారు. 'పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవడంపై విద్యార్థులతో అద్భుతమైన చర్చ జరిగింది' అని పేర్కొన్నారు. అలాగే ఈ వీడియోను అందరూ చూడాలని సూచించారు. కాగా.. ఈ చర్చలో ఢిల్లీ, కోయంబత్తూరు, రాయ్‌పూర్, గౌహతి నుంచి విద్యార్థులు హాజరయ్యారు.

బీఆర్ఎస్‌కు చిత్తశుద్ధి లేదు..: కవిత

అక్షరటుడే, హైదరాబాద్: బీసీల అంశంలో బీఆర్ఎస్ పార్టీ ఏనాడూ చిత్తశుద్ధితో వ్యవహరించలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటు వేయాలో.. వద్దో.. బీసీలు ఆలోచించుకోవాలన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పెద్ద నాయకులు బీఆర్ఎస్ పార్టీని గాలికి వదిలేశారా? అంటూ ప్రశ్నించారు. తమ రాజకీయ పార్టీ ఆవిర్భావానికి మంచి ముహూర్తం కోసం చూస్తున్నామని పేర్కొన్నారు. ఏర్పాటు ప్రక్రియ మూడు నెలల్లో పూర్తయ్యే అవకాశముందని కవిత తెలిపారు.

ఒత్తిడి ఎలా ఉంటుందో అప్పుడు తెలిసింది..

మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా సత్తా చాటుకుంటోంది. ఆమె నిర్మించిన తొలి చిత్రం 'కమిటీ కుర్రోళ్లు' బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ విజయంతో ఉత్సాహంలో ఉన్న నిహారిక.. ప్రస్తుతం భారీ ప్రాజెక్ట్ 'రాకాస' మూవీ పనుల్లో బిజీగా మారింది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూనే, మరోవైపు కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించేందుకు చిన్న సినిమాలకు అండగా నిలుస్తోంది. తాజాగా.. 'శ్రీచిదంబరంగారు' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న నిహారిక, ఆసక్తికర కామెంట్స్ చేసింది. 'సినిమా నిర్మాణం అనేది కేవలం పెట్టుబడికి సంబంధించిన విషయం కాదు. ఒక పెద్ద బాధ్యత' అని పేర్కొంది. ఒక చిత్రాన్ని పూర్తిస్థాయిలో భుజాన వేసుకున్నప్పుడు కలిగే ఒత్తిడి ఎలా ఉంటుందో 'కమిటీ కుర్రోళ్లు' సమయంలో తనకు స్వయంగా అనుభవమైంది' అని చెప్పుకొచ్చింది.

–అక్షరటుడే, సినిమా డెస్క్